క్లుప్తంగా

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



తిరుమలనగర్ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు

అగనంపూడి: జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ల ఆదేశాల మేరకు జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్‌లో శుక్రవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత మహా విశాఖ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులకు ప్రత్యామ్నాయంగా నార, గుడ్డ సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఓదురు అప్పారావు, కాలనీ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, రాజన్‌రాజు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నేడు

అగనంపూడి: పర్యావరణ సైన్స్ కాంగ్రెస్-24ను పురస్కరించుకొని శనివారం ఉదయం 10 గంటలకు లంకెలపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోస్టర్ పెయింటింగ్ ప్రదర్శన, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు తెలిపారు. పర్యావరణంపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. విద్యార్థులు ఎక్కువ మంది పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

చేతి బోరు ప్రారంభం



బోరు బావి ప్రారంభిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 72వ వార్డు ఆటోనగర్ దరి తోకాడలో ఏర్పాటు చేసిన చేతి బోరును శుక్రవారం వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు ప్రారంభించారు. దీని వల్ల సుమారు 60 నుంచి 70 నివాసాలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయుడు, పప్పు శంకర్రావు, జె.అన్నపూర్ణ, బ్రహ్మజీ పాల్గొన్నారు.

మురుగు పారే దారేది!



నడుపూరు ప్రధాన గెడ్డ దుస్థితి

పెదగంట్యాడ: ఎప్పుడు చూసినా ఒకటే దుస్థితి.. నిరంతరం అదే పరిస్థితి.. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యం అంటున్నారు పెదనడుపూరుకు చెందిన ప్రజలు..జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని ప్రధాన గెడ్డ పూడుకుపోయింది. ఈ గెడ్డలో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రమైతే చాలు దోమలు ఇళ్లలోకి ప్రవేశిస్తూ కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన కారణంగా ఇళ్లలోని కిటికీలు, తలుపులు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. అప్పుడప్పుడు తూతూమంత్రంగా చెత్త తొలగించి గెడ్డపక్కనే వదిలేస్తున్నారు. మళ్లీ చెత్తంతా గెడ్డలో జారిపడుతోంది. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో చెత్తాచెదారం, పూడిక తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నయా ట్రెండ్

‘గేటెడ్’

ప్రజల అభిరుచులు మారుతున్నాయి. ఒకప్పుడు వ్యక్తిగత ఇళ్లపై ఆసక్తి చూపిన జనం నేడు అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించడానికి ఇష్టపడుతున్నారు. మధ్యతరగతి వారితో పాటు ఉన్నత వర్గాలు సైతం జై కొడుతున్నారు. దీంతో గేటెడ్ కమ్యూనిటీలు, పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు, విల్లాలు వెలుస్తున్నాయి.

- అపార్ట్‌మెంట్ల నుంచి ఆకాశ హర్మ్యాలు
- మారుతున్న ప్రజల అభిరుచి
- భూముల ధరలు పెరగడమూ కారణమే..



అగనంపూడిలోని ఒక ప్రాంతంలో విస్తరించిన అపార్ట్‌మెంట్లు



గాజువాకలో గేటెడ్ కమ్యూనిటీ

గాజువాక: గాజువాక ప్రాంతంలో వేల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు వెలిశాయి. 194.96 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న గాజువాక జోన్‌లో 19 వార్డులు ఉన్నాయి. మొత్తం జనాభా 4.81 లక్షలు. ఈ పరిధిలో 1,45,196 గృహాలుండగా, అందులో 1197 అపార్ట్‌మెంట్లు, 13 గేటెడ్ కమ్యూనిటీలతోపాటు 851 గ్రూప్ హౌస్‌లు ఉన్నాయి. మిగిలిన వన్నీ వ్యక్తిగత గృహాలు.

20 ఏళ్లలో అత్యధిక నిర్మాణాలు

2005కు ముందు గాజువాక ప్రాంతంలో దాదాపు అందరూ వ్యక్తిగత ఇళ్ల నిర్మాణానికే ఇష్టపడేవారు. అప్పట్లో భూముల ధరలు తక్కువగా ఉండడంతో స్థలాలను కొనుగోలు చేసి నివాసాలను నిర్మించుకొనేవారు. ఆ సమయంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం అరుదుగా ఉండేవి. 2005 తర్వాత భూముల ధరలు అనూహ్యంగా పెరగడంతో ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలు సైతం అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేయడానికే ఆసక్తి చూపించడం ప్రారంభించారు. దీంతో గాజువాక ప్రాంతంలో అపార్ట్‌మెంట్లు గణనీయంగా పెరుగుతూ వస్తున్నాయి.

ధరలు ఇలా.. : ప్రస్తుతం గాజువాక ప్రాంతంలో వ్యక్తిగత గృహం నిర్మించుకోవాలంటే సుమారు కోటి రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. పోష్ ఏరియా, సెమీ పోష్ ఏరియాల్లో గజం స్థలం రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పలుకుతోంది. ఈ పరిస్థితుల్లో వంద చదరపు గజాల స్థలం కొనుగోలు చేయాలంటే కనీసం రూ.40 లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. అంత మొత్తంతో స్థలం కొనుగోలు చేసి వెంటనే ఇల్లు నిర్మించుకోవాలంటే మరో రూ.50 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. సాధారణ కుటుంబానికి ఇది ఆర్థిక భారంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేయడానికే వారు ఆసక్తి చూపిస్తున్నారు. సాధారణ అపార్ట్‌మెంట్‌లో వెయ్యి చదరపు అడుగుల ఫ్లాట్ రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల మధ్యలో లభిస్తున్నాయి. మరికొన్నిచోట్ల మరింత తక్కువ ధరకు కూడా లభిస్తున్నాయి. ఇంకొంచెం సౌకర్యాలు గల ఫ్లాట్‌లైతే రూ.50 లక్షలు, రూ.60 లక్షలు, రూ.75 లక్షలకు విక్రయిస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీల్లో కనీస ధర రూ.కోటి నుంచి మొదలవుతోంది.

వ్యక్తిగత ఇళ్ల నిర్మాణంతో ఆర్థిక భారం

ప్రస్తుతం భూముల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలు వ్యక్తిగత గృహాలు నిర్మించుకోవడం ఆర్థిక భారంగా భావిస్తున్నారు. దానికితోడు స్థల వివాదాలు, మున్సిపల్ అనుమతుల సమస్య కూడా అదనం. దీని కంటే అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసుకోవడం ఉత్తమం అని భావిస్తున్నారు.

పెరుగుతున్న అంతస్తులు

బిల్డర్లు తమ నిర్మాణాల్లో ట్రెండ్ మార్చారు. అపార్ట్‌మెంట్ల అంతస్తులను పెంచడంతోపాటు అదే ప్రాంగణంలో షాపింగ్ మాళ్లు, ఐనాక్స్ థియేటర్లు, వాకింగ్ ట్రాక్‌లు, క్లబ్ హౌస్‌లను అందుబాటులోకి తెస్తున్నారు. నిన్న మొన్నటివరకు ఐదు అంతస్తుల అపార్ట్‌మెంట్లు మాత్రమే ఉన్న గాజువాకలో ఇప్పుడు బహుళ అంతస్తుల భవనాలు అందుబాటులోకి వచ్చాయి. కనీసం 15 నుంచి 19 ఫ్లోర్‌లను నిర్మిస్తున్నారు. మెయింటెనెన్స్, సెక్యూరిటీ, బయోమెట్రిక్ ఎంట్రీ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ఎప్పుడూ సందడే..



అపార్ట్‌మెంట్లలో కమ్యూనిటీ చాలా బాగుంటుంది. వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఫ్లాట్‌లలోకి వస్తారు. అన్ని పండుగలు, స్వాతంత్య్ర దినోత్సవం వంటి కార్యక్రమాలతో పాటు ఇతర వేడులకను అందరం కలిసి చేసుకుంటాం. ఐక్యంగా ఉండటానికి అపార్ట్‌మెంట్ సంస్కృతి చాలాబాగా దోహదం చేస్తుంది.

– అబ్బాస్, రామకృష్ణ హైట్స్, చినగంట్యాడ

భద్రతకు భరోసా



అపార్ట్‌మెంట్లలో నివాసం వల్ల భద్రత, భరోసా ఉంటుంది. గేటెడ్ కమ్యూనిటీలో 24/7 భద్రత ఉంటుంది. దీనివల్ల ఎక్కడికైనా వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇక్కడ ఏం జరిగిపోతుందో అనే భయం అవసరంలేదు. ఏ సమస్య వచ్చినా ఇరుగు, పొరుగువారి సహకారం బాగుంటుంది. గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఒక కాలనీలో మాదిరిగా ఉంటుంది.

– సింగంపల్లి రాజేశ్వరి, సెలెస్ట్ గేటెడ్ కమ్యూనిటీ

కస్టమర్ల ఆసక్తికి తగ్గట్టుగా ..



మారుతున్న కాలానికనుగుణంగా కస్టమర్ల అభిరుచుల్లో మార్పులు వస్తున్నాయి. తక్కువ ధరలో ఎక్కువ సౌకర్యాలు కోరుకొంటున్నారు. వీలైనంత తక్కువ ధరలో ఎక్కువ సౌకర్యాలు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తుంటాం. ఎక్కువ మంది భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌లు కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు.

– సందీప్ రెడ్డి, బిల్డర్, గాజువాక

‘స్టీల్‌ప్లాంట్’పై ప్రధాని ప్రకటన చేయాలి



ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ విజ్ఞప్తి చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో శుక్రవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు రెండు నెలల నుంచి పూర్తిగా జీతాలు చెల్లించలేదన్నారు. ఫలితంగా కార్మికులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులు కుటుంబాలతో సహా రోడ్లపైకి వచ్చి నిరసనలు చేస్తున్నా యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. ఈఎంఐలు కట్టలేక ఉద్యోగులు ఏదైనా చేసుకుంటే ఎవరు బాధ్యత తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఉన్నతాధికారులు మాత్రం ఒకటో తేదీన జీతాలు తీసుకుంటూ కార్మికులను ఇబ్బంది పెట్టడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. 29న విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీతో ప్రైవేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటన చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.టి. దాస్, యు. రామస్వామితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నెంబర్ –1 లక్ష్యం

గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి



అక్కిరెడ్డిపాలెం జెడ్పీహై స్కూల్‌లో మాట్లాడుతున్న జెడ్పీ శేషాద్రి

అక్కిరెడ్డిపాలెం: స్వచ్ఛ సర్వేక్షన్‌లో విశాఖను ప్రథమ స్థానంలో నిలబెట్టే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి అన్నారు. అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో భాగంగా డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. దోమల వ్యాప్తి వల్ల ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పెట్టాలని కోరారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలు వినియోగించాలన్నారు. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, సీవో లక్ష్మి, నాయకులు అనంతలక్ష్మి, రోహిణి, సచివాలయ కార్యదర్శులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు



దివ్యాంగ విద్యార్థులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న యువత

పెదగంట్యాడ: భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులో సత్యసాయి సేవకుడు గొందేశి గురప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, వెంపల్లినగర్ భజన మండలి కన్వీనర్ గల్లా శంకర్ సాయిరాం సత్యసాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయి సేవకులు గొందేశి ఎరుకునాయుడు, యలమంచిలి అప్పలనాయుడు, ములకలపల్లి ప్రకాష్, మోదు బంగార్రాజు,కిలాని ముసలయ్య, గురునాథరెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవ, ఆధ్యాత్మిక మందిరంలో శుక్రవారం సేవాదినోత్సవం నిర్వహించారు. సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భాగంగా సత్యసాయి యువత ఆధ్వర్యంలో అచ్యుతాపురంలోని దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువత వి. రామారావు, రామచంద్రరావు, కృష్ణ, ఆనంద్, రమణ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

‘ఉక్కు’కు మద్దతుగా 24న ర్యాలీ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 24న గాజువాకలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం ఎల్ఎంఎం పార్కులో కార్మిక ర్యాలీ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయన్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించడం లేదన్నారు. ఈనెల 29 విశాఖ పర్యటనలో ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపి వేస్తున్నామని ప్రకటన చేయాలన్న డిమాండ్‌తో ఆ రోజు పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు ర్యాలీ, అనంతరం జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, నమ్మి రమణ, నాగరాజు, వంశీకృష్ణ, ఉరుకూటి అప్పారావు, గురునాథ్, వరహాలు, వేణు తదితరులు పాల్గొన్నారు.

తవ్వేశారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు



టోల్‌గేటు రోడ్డుపై తేలిన పిక్కలు



అగనంపూడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

- అదుపుతప్పుతున్న ద్విచక్రవాహనాలు
- రెండు రోజుల్లో 24 మందికి గాయాలు

అగనంపూడి: అగనంపూడి టోల్‌గేటు వద్ద జాతీయ రహదారిని అడ్డగోలుగా తవ్వి వదిలేశారు. దీంతో పిక్క, రాళ్లు తేలిపోయి ద్విచక్రవాహనాలు అదుపుతప్పి వాహనచోదకులు జారిపడి గాయాలపాలవుతున్నారు. కూర్మన్నపాలెం నుంచి లంకెలపాలెం వరకు జాతీయ రహదారి అతుకుల బొంతగా మారడంతో పాటు ఎగుడు దిగుడుగా ఉండడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్‌హెచ్ఏఐ అధికారుల నిర్లక్ష్యంపై ఇటీవల పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తడంతో టోల్‌గేటు నుంచి రహదారిపై లేయర్ వేయడానికి సన్నాహాలు చేశారు. దీనిలో భాగంగా అస్తవ్యస్తంగా ఉన్న రహదారి పై లేయర్‌ను తొలగించారు. తర్వాత నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. దీంతో రోజూ కనీసం 20 మంది వరకు వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. బుధ, గురువారాల్లో అగనంపూడి ఆస్పత్రిలో 24 మంది బాధితులు ప్రథమ చికిత్సపొందారు. చిన్నపాటి దెబ్బలతో మరో పది మంది వరకు ఆస్పత్రికి వెళ్లకుండా ఇంటికి వెళ్లిపోయిన వారు ఉన్నారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందించి వెంటనే రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం!

- దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలపైకి చెట్ల కొమ్మలు
- ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు







దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలపై చెట్లు అడ్డంగా పెరిగిపోయి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. ఒకటి, నాలుగో ప్లాట్‌ఫారాల గోడలకు ఆవలవైపున నాటిన చెట్లు గుబురుగా పెరిగి కొమ్మలు ఫ్లాట్‌ఫారాలపైకి రావడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. లగేజీలు, పిల్లలు, వృద్ధులతో వెళ్లేటప్పుడు ఆటంకంగా మారుతున్నాయి. అలాగే దువ్వాడ, రాజీవ్‌నగర్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారికిరువైపులా చెట్లు, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడని పరిస్థితి ఉంది. రైల్వే అధికారులు స్పందించి వెంటనే వాటిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- అగనంపూడి



భౌబోయ్



పెదగంట్యాడ ప్రధాన రహదారిలో పరుగు తీస్తున్న శునకాలు



గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

గుంపులు గుంపులుగా కుక్కల సంచారం

పెదగంట్యాడ: పెదగంట్యాడ మండల పరిధిలో ప్రతి గ్రామంలో గ్రామ సింహాల స్వైర విహారం ఎక్కువైంది. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో రోడ్లపైకి ఒంటరిగా రావాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండల పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రిల్లో నెలకు 300 పైగా కేసులు నమోదవుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమౌవుతుంది. కుక్కలను తప్పించుకోవడానికి ద్విచక్ర వాహనచోదకులు వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో అయితే ఇంక చెప్పనవసరం లేదు. దాడులు చాలా ఎక్కువగా ఉన్నాయి. శునకాల నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.